సాక్షి నిర్మల్

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



'చాకిరేవు'కు వెలుగు

పెంబి మండలంలోని మారుమూల గ్రామం చాకిరేవుకు సినీ హీరో నందమూరి బాలకృష్ణ రూ.లక్ష చెక్కు అందించారు. త్వరలో గ్రామానికి వెలుగు నిచ్చేందుకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయిస్తామని ప్రోగ్రాం తరఫున హామీ ఇచ్చారు. 8లో



నాందేడ్ సభ.. ప్రతిష్టాత్మకం

రాష్ట్రం బయట నిర్వహించే బీఆర్ఎస్ మొదటి సభ ఈనెల 5న నాందేడ్‌లో నిర్వహించనున్నారు. సభను విజయవంతం చేసేందుకు నాయులు శ్రమిస్తున్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. 10లో

గరిష్టం/కనిష్టం
31.3 / 14.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా అనిపిస్తుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బెటాలియన్ పనులు ప్రారంభించిన ఎస్పీ



భూమిపూజ చేస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

భైంసాటౌన్: భైంసాలో టీఎస్ఎస్పీ రెండో బెటాలియన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గడ్డెన్న వాగు ప్రాజెక్టు సమీపంలో కేటాయించిన స్థలంలో బ్యారక్‌ల నిర్మాణ పనులకు భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్‌తో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.2.54 కోట్లతో బెటాలియన్ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి బెటాలియన్ సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జయరాజ్, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



టీకా కేంద్రాన్నిపరిశీలిస్తున్న పశువైద్యాధికారి

కుంటాల: మూగజీవాలకు వ్యాధులు ప్రబలకుంగా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పశువైద్యాధికారి శంకర్ అన్నారు. మండలంలోని అందకూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బ్రూసోలోఫిష్ టీకా కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. 4 నుంచి 8 నెలల్లోపు ఆడ దూడలకు వ్యాధులు ప్రబలకుండా ఈ టీకాలు ఉపయోగపడతాయన్నారు. ఆయన వెంట సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్, పశువైద్యాధికారి ప్రకాశ్ ఉన్నారు.

పదోన్నతులపై పేచీ సరికాదు

- తపస్ జిల్లా అధ్యక్షుడు నవీన్



మాట్లాడుతున్న నవీన్

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయుడు ఒకటి కన్నా ఎక్కువ సబ్జెక్టులలో పదోన్నతి పొందేందుకు అర్హత కలిగి ఉన్నప్పటికీ ఏదైనా ఒకే సబ్జెక్టు ఎంచుకుంటానని హామీ పత్రం ఇవ్వమనడం సమంజసం కాదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నవీన్‌కుమార్, వేముల సుదర్శన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శుక్రవారం వారు మాట్లాడారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, అక్రమ బదిలీలు ఆపాలని, ప్రమోషన్లు, బదిలీలు పారదర్శకత్వం పాటించి సజావుగా సాగేలా చూడాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు జి.రాజేశ్వర్, ఆర్.రాజేశ్వర్, ధీరజ్ కులకర్ణి, జైస్వాల్ చంద్రప్రకాశ్, దత్తురామ్ పటేల్, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు టీఎల్ఎం కిట్ల పంపిణీ



కిట్లు పొందిన విద్యార్థులతో అధికారులు

నిర్మల్ రూరల్: జిల్లాలోని ప్రత్యేక అవసరాలు, మానసిక వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఎన్ఐఈపీఐడీ హైదరాబాద్, ఎన్ఐఎంహెచ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 17 మందికి టీఎల్ఎం కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. జిల్లా విలీన విద్య సమన్వయకర్త ప్రవీణ్‌కుమార్ సమక్షంలో జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ ఉన్నత పాఠశాలలో లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజ్ఞ తక్కువగా ఉండి, మానసిక వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఈ కిట్లు చాలా ఉపయోగపడతాయన్నారు. ఒక్కో కిట్ విలువ రూ.10 వేలకుపైనే ఉంటుందని తెలిపారు. వీటిని విలీన విద్యా రిసోర్స్ టీచర్ల సహాయంతో ఉపయోగించుకోవాలని సూచించారు. ధని ఉన్నత పాఠశాల హెచ్ఎం సలోమి కరుణ మాట్లాడుతూ మానసిక వైకల్యం గలవారు కొన్నింటిలో వెనుకబడినా.. కొన్నింటిలో ప్రతిభ కనబరుస్తారన్నారు. వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎన్ఐఎంహెచ్ అధికారి శ్యామ్‌మార్గం కిట్ల వినియోగంపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. రాష్ట్ర విలీన విద్య రిసోర్స్ పర్సన్ దయానంద్, నిర్మల్ విలీన విద్య రిసోర్స్ పర్సన్స్ నాగరాజు, రాకేశ్, పాల్గొన్నారు.

మొగి ముంచుతోంది..!



వరికి పురుగు మందు పిచికారీ చేస్తున్న ఈ రైతుపేరు ఈరన్న. ధర్మోరా గ్రామానికి చెందిన ఈయన యాసంగిలో నాలుగు ఎకరాల్లో వరి నాట్లు వేశాడు. పది రోజులకే మొగి పురుగు ఆశించడంతో పంట మొత్తం ఎర్రబడింది. దీంతో ఫెర్టిలైజర్ దుకాణానికి వెళ్లి వాళ్లు ఇచ్చిన మందు కొని తెచ్చి రెండు సార్లు రసాయన మందు పిచికారీ చేశాడు. రూ.10 వేల వరకు ఖర్చు చేశాడు. అయినా మూడెకరాల్లో పంట పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. ఎకరం మాత్రమే మిగిలింది.

- వందలాది ఎకరాల్లో పంటకు నష్టం
- ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం
- జిల్లా రైతుల్లో ఆందోళన
- పట్టించుకోని వ్యవసాయ అధికారులు

వానాకాలంలో రైతులను వరుణుడు ముంచాడు. అధిక వర్షాలతో చాలావరకు పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడి తగ్గింది. యాసంగి అయినా కలిసి వస్తుందనుకుంటే ప్రారంభంలోనే మొగి పురుగు వరి రైతులను నిండా ముంచుతోంది. ఎన్నో కష్టాలకోర్చి సాగు చేసిన యాసంగి వరి పంటకు ఆదిలోనే మొగిపురుగు నష్టం కలిగిస్తోంది. ఇప్పటికే జిల్లాలో వందలాది ఎకరాల్లో పంటను ఆశించింది. రైతులు వారికి తెలిసిన, ఫెర్టిలైజర్ షాపుల యజమానులు ఇచ్చిన రసాయన మందులనే పిచికారీ చేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం వ్యవసాయ క్షేత్రాలవైపు కన్నెత్తి చూడడం లేదు.

– లోకేశ్వరం

జిల్లాలో జలాశయాల్లో పుష్కలంగా నీరు ఉండడంతో యాసంగిలో 92 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా వరికి ప్రారంభ దశలోనే మొగిపురుగు ఆశించి వందలాది ఎకరాల్లో పంటలను నాశనం చేస్తోంది. దీని ఉధృతికి నాట్లు వేసిన పొలాలు ఎర్రబారి పిలికలు రావడం లేదు. ఎన్ని క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరులో నాట్లు వేసిన పొలాల్లో మొగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. వానాకాలంలోనూ మొగిపురుగు కారణంగా వరిలో తెల్లకంకి ఏర్పడి దిగుబడి బాగా తగ్గింది.

నాట్లు వేసిన 15 రోజులకే..

రైతులు చెరువులు ఆయకట్టు కింద, బోరుబావుల ఆధారంగా వరి సాగుచేశారు. యాసంగి నాట్లు మొదలై నెలరోజులైంది. నాట్లు వేసిన 15 రోజులకే మొగిపురుగు పంటను ఆశించి నష్టం కలిగిస్తోంది. పంటను కాపాడుకోవడానికి రైతులు ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.4 వేలు ఖర్చు చేసి రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. కొందరు రైతులు పంటను తొలగించి కొత్తగా మళ్లీ నాట్లు వేయిస్తున్నారు.



గొడిసెరాలో మొగిపురుగు సోకి దెబ్బతిన్న వరి పంట

జిల్లా అంతటా ప్రభావం..

వరిలో మొగిపురుగు ప్రభావం జిల్లాలో అన్ని మండలాల్లో కనిపిస్తోంది. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శించక పోవడంతో రైతులు పురుగు తగిలిన వరి మొలకలను తీసుకుని పెస్టిసైడ్ దుకాణాలకు వెళ్తున్నారు. వాటిని చూసిన దుకాణాదారులు వారికి తెలిసిన మందులు రైతులకు కట్టబెడుతున్నారు. అధికారులు సరైన సూచన చేస్తే రైతులకు అదనపు ఖర్చు తగ్గే అవకాశం ఉంది.

రెండు సార్లు పురుగుమందు కొట్టిన



నాలుగు ఎకరాల్లో వరి నాట్లు వేసిన. 15 రోజులకే మొగిపురుగు తగిలింది. ఇప్పటికీ రెండు సార్లు మందులను స్ప్రే చేసిన. ఇందుకు రూ.10 వేలు ఖర్చు చేసిన. అయినా మొగి పురుగు ఉధృతి పూర్తిగా తగ్గలేదు. పెట్టుబడి భారంగా మారింది. – రాజు, గొడిసెరా రైతు

ఎప్పుడూ చూడలేదు



ఎకరంలో వరి నాట్లు వేసిన. ఎన్నడూ లేనంతగా ఈసారి పంటకు అధికంగా మొగిపురుగు తలిగింది. రెండు సార్లు పురుగుల మందు పిచికారీ చేసిన. రూ.2 వేలు ఖర్చయింది. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదు.
– దిమేరి చిన్న సాయన్న, పంచగుడి రైతు

వాతావరణం అనుకూలించక

వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండడంతో మొగిపురుగు ఉధృతి పెరిగింది. నారు కొనల్లో మొగిపురుగు గుడ్లు పెడుతుంది. నాట్లు వేసే సమయంలో కొనలను తుంచడం ద్వారా ఉధృతి తగ్గించవచ్చు. నాట్లు వేశాక పంటను ఆశిస్తే 15–20 రోజుల వ్యవధిలో త్రీజీ లేదా 10 జీ గుళికలు చల్లితే ఫలితం ఉంటుంది.
– అంజి ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

సబ్సిడీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- స్పైస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్



పసుపు ఉడికించే యంత్రాలతో రైతులు

పెంబి: స్పైస్ బోర్డు అందిస్తున్న సబ్సిడీ యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్పైస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్ సూచించారు. మండల కేంద్రంలోని శ్రీవెంకటసాయి రైతు సేవా సహకార పరపతి సంఘానికి స్పైస్ బోర్డ్ ద్వారా సబ్సిడీపై పసుపు ఉడికించే రెండు యంత్రాలను అందజేశారు. స్పైస్ బోర్డు ద్వారా అందిస్తున్న సబ్సిడీ యంత్రాలను రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ రైతులు ఉన్నారు.

6న బీజేపీ ధర్నాకు హైకోర్టు అనుమతి

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలంటూ బీజేపీ చేపట్టనున్న మహాధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. జనవరి 31న కలెక్టరేట్ ఎదుట ధర్నా కోసం ప్రయత్నించగా, అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. నేతలను ముందస్తు అరెస్టు చేశారు. అక్కడికి వచ్చిన నాయకులనూ బలవంతంగా లాక్కెళ్లారు. ఈక్రమంలో బీజేపీ నాయకులు హైకోర్టులో పిటిషన్ వేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నాకు కోర్టు శుక్రవారం అనుమతిచ్చింది. ఈమేరకు ఈనెల 6న సోమవారం మాస్టర్ ప్లాన్ ముసాయిదా రద్దు చేయాలన్న డిమాండ్‌తో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు అంజుకుమార్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

సారంగపూర్ మండలం జామ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో 5వ తరగతి విద్యార్థిని మహిత(12) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. 8లో

'సమీకృతం' వేగవంతం చేయాలి

- ప్రాంగణమంతా పచ్చదనంతో నిండాలి
- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- డబుల్‌బెడ్రూం ఇళ్లు, ఈవీఎంల గోదాం పరిశీలన



కొత్తకలెక్టరేట్‌లో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్: పరిపాలన సౌలభ్యం కోసం నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ పనులు త్వరగా పూర్తి చేయాలని, ప్రాంగణమంతా పచ్చదనంతో కళకళలాడాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రం శివారులో నిర్మిస్తున్న కొత్త కలెక్టరేట్ పనులను శుక్రవారం పర్యవేక్షించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా బ్లాకుల వారీగా పూల మొక్కలు నాటాలన్నారు. భవనం ఆవరణలో పూలు, పండ్ల మొక్కలను నాటి, వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారుల నిర్మాణ పనులు, సివిల్, గ్రౌండింగ్, కాంపౌండ్‌వాల్, లిఫ్ట్ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. భవనంలోని అన్ని గదులకు తాగునీరు అందేలా పైపులైన్లు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం బంగల్‌పేట్, నాగనాయిపేట్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. మార్చి ఒకటిలోగా పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతీనెల తనిఖీలో భాగంగా శుక్రవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్థానిక కొత్త కలెక్టరేట్ వెనుక గోదాములో ఈవీఎంలను పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ రాంబాబు, డీఆర్వో లోకేశ్, ఆర్డీవో స్రవంతి, ఆర్అండ్‌బీ ఈఈ అశోక్, పీఆర్‌ఈఈ శంకరయ్య, డీసీవో శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి శ్యామ్‌రావురాథోడ్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన దివ్యాంగులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దివ్యాంగులు



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న అంగన్వాడీ టీచర్లు

నిర్మల్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ వరుణ్‌రెడ్డిని పలు దివ్యాంగుల సంస్థల సభ్యులు వేర్వేరుగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి సంఘం(టీడీఆర్‌డీవో) బాధ్యులు సట్టి సాయన్న, తోట్ల క్రాంతికుమార్, మగ్గిడి గంగన్న, పుట్ట గంగాధర్, జగదేక రాందాస్, తెలంగాణ స్పందన దివ్యాంగుల హక్కుల సమితి బాధ్యులు గుమిడ్యాల గంగాధర్, ఇసాక్‌అలీ, సగ్గం ముత్యం, శివకుమార్, మీనాక్షి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు..

ఖానాపూర్: కలెక్టర్ వరుణ్‌రెడ్డిని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు శుక్రవారం కలిశారు. మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి పెంబి విద్యార్థి



విద్యార్థిని సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పెంబి: నిర్మల్ కేంద్రంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంగ్లిష్ విబార్డ్ జిల్లా స్థాయిలో పోటీల్లో పెంబి ప్రభుత్వ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని సాజిదా కౌసర్ మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. పోటీల్లో 19 మండలాలకు చెందిన 76 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో సాజిదా కౌసర్ పాల్గొంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహాచారి తెలిపారు.

మున్సిపల్ ముట్టడి ఉద్రిక్తం



డీఎస్పీ జీవన్‌రెడ్డితో మహేశ్వర్‌రెడ్డి వాగ్వాదం

- దూసుకువచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- బల్దియా కార్యాలయం ఎదుట భైఠాయించిన 'ఏలేటి'
- బలవంతంగా అరెస్టు చేసిన పోలీసులు
- డీఎస్పీతో నాయకుల వాగ్వాదం



మున్సిపల్ కార్యాలయం ఎదుట భైఠాయించిన ఏలేటి మహేశవర్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ ముసాయిదా రద్దు చేయాలంటూ కాంగ్రెస్ నేతలు శుక్రవారం సాయంత్రం చేపట్టిన మున్సిపల్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ప్రతిపాదిత మాస్టర్‌ప్లాన్ బాధితులు, కాంగ్రెస్ నాయకులు ఒక్కసారిగా బల్దియా వద్దకు దూసుకువచ్చారు. మున్సిపల్ ద్వారం ఎదుట భైఠాయించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు సీఐలు, ఎస్సైలు కలిసి వారందరినీ బలవంతంగా లాక్కెళ్లారు. జీపుల్లో ఎక్కించి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు అక్కడికి చేరుకున్నాయి. ఈక్రమంలో స్టేషన్ వద్ద కాసేపు ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ నేతలు, డీఎస్పీ, సీఐల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం మహేశ్వర్‌రెడ్డితోపాటు పార్టీ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

భూముల కబ్జాకు 'ప్లాన్'

నిర్మల్‌లో విలువైన భూములను తన సొంతం చేసుకోవడానికే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాస్టర్'ప్లాన్' తయారుచేయించారని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఈ ముసాయిదాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల భూముల్లో గ్రీన్‌జోన్‌పెట్టి, తన తమ్ముడి భూముల్లో ఉన్న పరిశ్రమల జోన్ మార్పించారని ఆరోపించారు. మంజులాపూర్ రైతుల భూముల్లో ఇండస్ట్రియల్‌జోన్ పెట్టారని, తమకు అనుకూలంగా జోన్లను మార్చుకున్నారని మండిపడ్డారు. చెరువులో కలెక్టరేట్ కట్టి, గ్రీన్‌జోన్‌ను కొల్లగొట్టారన్నారు. ధర్మసాగర్‌లో కొత్తగా కట్ట నిర్మించి, తన కొడుకు పేరిట భూకబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. తన ఇంటితోసహా తను ఉన్న కాలనీని గ్రీన్‌జోన్‌లో పెట్టారని, తనపై కక్ష ఉంటే తనపై చూపాలన్నారు. ముట్టడిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30 కిలోమీటర్లు.. ముప్పతిప్పలే!

ఈ చిత్రంలో కనిపిస్తున్నది బాసర ట్రిపుల్ ఐటీ సమీపంలో భైంసా–బాసర రహదారి. రోడ్డుపై రెండుచోట్ల భారీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడకుండా, గుంతలు గమనించేలా ఇలా ముళ్లకంచె వేశారు. ఈ దృశ్యం రహదారి దుస్థితికి అద్దం పడుతోందని చెప్పవచ్చు.





బిద్రెల్లి వద్ద రోడ్డుపై భారీ గుంత

- అధ్వానంగా భైంసా–బాసర రహదారి
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- తాత్కాలిక మరమ్మతులు కూడా చేయని వైనం..

భైంసాటౌన్: భైంసా–బాసర రహదారి అధ్వానంగా మారింది. దాదాపు 30 కిలోమీటర్లు పెద్దపెద్ద గుంతలతో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణానికి ముప్పతిప్పలు పడుతున్నారు. పలు సందర్భాల్లో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ద్విచక్రవాహనదారులు గుంతలు కనిపించక కిందపడుతున్నారు. గుంతలను తప్పించే క్రమంలో వాహనాలు ఢీకొంటున్నాయి. ఈ ప్రమాదాల్లో కొందరు మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదంలో దేగాం, ఇలేగాం, హంగిర్గా, కుంసర గ్రామాలకు చెందిన యువకులు దుర్మరణం చెందారు.

ఆర్అండ్‌బీ నుంచి హైవేగా..

ఇదివరకు ఈ రోడ్డు ఆర్అండ్‌బీ పరిధిలో ఉండేది. ప్రస్తుతం హైవే పరిధిలోకి వెళ్లింది. 161బీబీగా నామకరణం చేసిన ఈ హైవే పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ఇంకా ప్రారంభం కాలేదు. హైవే పరిధిలోకి వెళ్లడంతో ఆర్అండ్‌బీ అధికారులు గుంతలకు ప్యాచ్ వర్క్ పనులను పట్టించుకోవడం లేదు. హైవే పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో.. తమ కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని వాహనదారులు ఎదురుచూస్తున్నారు.

గుంతలతో ప్రమాదాలు...

భైంసా నుంచి బాసర వరకు దాదాపు 30 కి.మీ.ల మేర రహదారి విస్తరించి ఉంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరలో అమ్మవారిని దర్శించుకునేందుకు మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు ఈ రహదారి మీదుగానే వస్తుంటారు. భైంసా నుంచి నిజామాబాద్, హైదరాబాద్‌కు ఈ రోడ్డు మీదుగానే వాహనాల రాకపోకలు సాగుతాయి. అయితే, భైంసా నుంచి మొదలు బాసర వరకు పలుచోట్ల రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వాన్నంగా మారింది. దేగాం, ముధోల్, బిద్రెల్లి, బాసర ట్రిపుల్ వద్ద రోడ్డు మధ్యలోనే భారీ గుంతలు ఏర్పడ్డాయి.

ఇష్టారీతిన ప్యాచ్‌వర్క్...

భైంసా–బాసర రహదారిపై ఏర్పడిన గుంతలకు ఇటీవల ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. కొన్నిచోట్ల గుంతలు పూడ్చి చాలాచోట్ల అలాగే వదిలేశారు. ముధోల్ మండలం టాక్లి గ్రామం వద్ద ఓవైపు రోడ్డుపై ప్యాచ్ వర్క్ చేపట్టగా, మరోవైపు గుంతలు పూడ్చలేదు. రహదారి పొడువునా చాలాచోట్ల గుంతలు పూడ్చలేదు. హైవే పనుల కోసం ప్రస్తుతం సర్వే కొనసాగుతోంది. పనుల ప్రారంభానికి నెల, రెండునెలలు సమయం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. అప్పటి వరకు ప్యాచ్ వర్క్ చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

టైరు పగిలి కారు బోల్తా



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని రామాయి గ్రామంలోగల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శ్రీలత రోజులాగే శుక్రవారం తన కారులో పాఠశాలకు వెళ్తున్నారు. ఈక్రమంలో రాంపూర్‌ సమీపంలో కారు టైరు పగిలింది. దీంతో వాహనం బోల్తా పడింది. ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఆమె ప్రాణాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన సామగ్రి

లోకేశ్వరం: మండల కేంద్రంలో పెద్దోల్ల పోతన్నకు చెందిన ఇల్లు విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో పాక్షికంగా దగ్ధమైంది. ఆర్‌ఐ బాలకిషన్‌, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పోతన్న తన భార్య భోజవ్వతో కలిసి కూలీ పనులకు వెళ్లాడు. 11గంటల సమయంలో విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో నిప్పంటుకొని ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఇరుగుపొరుగువారు గమనించి మంటలను ఆర్పివేశారు. రూ.50వేల ఆస్తినష్టం జరిగినట్లు ఆర్‌ఐ బాలకిషన్‌ తెలిపారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



అధికారులకు జింకను అప్పగిస్తున్న పోలీసులు

తానూరు: మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో శుక్రవారం కుక్కల దాడిలో జింకకు గాయాలయ్యాయి. ఓని బాలాజీ అనే రైతు గమనించి కుక్కలను తరిమివేశాడు. గాయాలైన జింకను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌ శివరాంకు అప్పగించాడు. విషయం తెలుసుకున్న ఎఫ్‌ఆర్వో రాథోడ్‌ రమేశ్‌, డీఎఫ్‌ఆర్వో ఇర్ఫానొద్దీన్‌ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. చికిత్స నిమిత్తం జింకను భైంసాకు తీసుకువెళ్లారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



ఉమాకాంత్‌ (ఫైల్‌)

తలమడుగు: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఏఎస్సై గంగధార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మొడపు ఉమాకాంత్‌ (32) పెయింటింగ్‌ వర్క్‌ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దికాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మద్యం మత్తులో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

‘ఐటీ టవర్‌’పై ఆనందహేల



సంబరాలు జరుపుకొంటున్న ఐటీ ఉద్యోగులు

- పరిపాలన అనుమతులు రావడంపై సంబురాలు
- కేక్‌ కట్‌ చేసిన ఐటీ ఉద్యోగులు

ఆదిలాబాద్‌: జిల్లాలో ఐటీ టవర్‌ నిర్మించనుండగా ఐటీ ఉద్యోగులు సంబురపడుతున్నారు. ఐటీ టవర్‌ నిర్మాణానికి గురువారం ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐటీ కంపెనీ బీడీఎన్టీ ల్యాబ్‌ సంస్థలో ఉద్యోగులు, సిబ్బంది కేక్‌ కట్‌ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ ప్రణవి మాట్లాడారు. ఐటీ టవర్‌ నిర్మాణంతో జిల్లాలో కొత్త ఐటీ కంపెనీలు నెలకొల్పే అవకాశం ఉందన్నారు. అలాగే ఐటీ కంపెనీల నిర్వహణకు అవసరమైన అన్నిరకాల సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దీంతో మెరుగైన ఐటీ సేవలు అందించవచ్చని తెలిపారు. ఐటీ ఉద్యోగులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విధులు నిర్వర్తించవచ్చన్నారు. జిల్లాలో ఐటీ టవర్‌ నిర్మాణంపై పలువురు ఐటీ ఉద్యోగులు వారి అభిప్రాయాలు సాక్షితో పంచుకున్నారు.

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవచ్చు



ఆదిలాబాద్‌ లాంటి ద్వితీయ శ్రేణి పట్టణంలోనూ ఐటీ కంపెనీ ఏర్పాటవుతుందని ఊహించలేదు. ఐటీ కంపెనీ ఏర్పాటు అవ్వడమే కాకుండా ప్రస్తుతం ఐటీ టవర్‌ నిర్మాణానికి సంబంధించి కూడా నిధులు మంజూరు కావడం హర్షణీయం. ఐటీ టవర్‌ నిర్మాణంతో నూతన ఐటీ కంపెనీల ఏర్పాటుతో ఐటీ ఉద్యోగులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చు. ఐటీ కంపెనీకి అవసరమైన అన్ని సదుపాయాలు ఐటీ టవర్‌ నిర్మాణంతో సమకూరుతాయి.

– శృతి, బీడీఎన్టీ ల్యాబ్‌, అసిస్టెంట్‌ మేనేజర్‌

అన్ని రంగాల్లో అభివృద్ధి



గతంలో ఐటీ కంపెనీలు హైదరాబాద్‌, బెంగళూరు, ముంబై లాంటి మెట్రో నగరాల్లోనే ఏర్పాటయ్యేవి. ప్రభుత్వ ప్రోత్సాహంతో పట్టణాల్లోనూ కంపెనీల ఏర్పాటుకు పలువురు ముందుకువస్తున్నారు. సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగాలు చేయడానికి సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా, సొంత ఊరిలోనే ఉద్యోగాలు చేసుకునే సౌలభ్యం దక్కింది. ఐటీ టవర్‌ నిర్మాణంతో ఐటీ సేవలతో సేవా, వాణిజ్యం, వ్యవసాయం లాంటి అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయి.

– స్వర్గ, బ్రాహ్మణవాడ, ఐటీ ఉద్యోగి

వెలుగులోకి వినూత్న ఆవిష్కరణలు



ఆదిలాబాద్‌ జిల్లాలో ఐటీ టవర్‌ నిర్మాణంతో ఎంతో మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. జిల్లాలో ఐటీ కంపెనీ ఏర్పాటైనా.. ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు తప్పలేదు. టవర్‌ ఏర్పాటైతే విద్యుత్‌ సౌకర్యం మెరుగవుతుంది. ఫలితంగా ఐటీ సేవలు నిరాటంకంగా కొనసాగుతాయి. కొత్త స్టార్టప్‌ సంస్థలతో వినూత్నమైన ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయి.

– ఉజ్వల, ఫిల్టర్‌బెడ్‌ కాలనీ, ఐటీ ఉద్యోగి

‘చాకిరేవు’కు వెలుగు



రూ.లక్ష చెక్కు ఇస్తున్న బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్‌



షోలో మాట్లాడుతున్న చాకిరేవు ఆదివాసీ గిరిజనులు

- బాలకృష్ణ అన్‌స్టాపబుల్‌ షోలో చాకిరేవు గ్రామ ప్రస్తావన
- గ్రామానికి రూ.లక్ష చెక్కు
- షో తరఫున సోలార్‌ సిస్టం ఏర్పాటు చేయిస్తామని హామీ

పెంబి: చాకిరేవు.. నిర్మల్‌ జిల్లా పెంబి మండలంలోని మారుమూల గ్రామం. ఈ గ్రామం అటవీ ప్రాంతంలో ఉండగా రోడ్డు, కరెంట్‌, తాగునీటి సౌకర్యం కూడా లేదు. కనీస సౌకర్యాలు కల్పించాలని గతంలో ఈ గ్రామ ఆదివాసీ గిరిజనులు గ్రామం నుంచి నిర్మల్‌ జిల్లా కేంద్రానికి 70కిలో మీటర్లు పాదయాత్ర నిర్వహించి కలెక్టర్‌కు సమస్యలు తెలిపారు. కనీస వసతులు కల్పించేవరకూ కలెకర్‌ కార్యాలయం నుంచి కదలబోమని భీష్మించారు. అక్కడే కూర్చొని దీక్ష చేపట్టారు. దీంతో కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు మారుమూల చాకిరేవుకు గ్రామానికి పరుగులు తీసి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే తాగేందుకు బోర్లు వేయడంతో గ్రామస్తులు దీక్ష విరమించి గ్రామానికి వెళ్లారు. పట్టు వీడకుండా కనీస వసతుల కోసం 70కిలో మీటర్లు నడిచి తాగునీరు తెచ్చుకుని రాష్ట్రంలో హాట్‌ టాఫిక్‌గా పెంబి మండల, చాకిరేవు గ్రామం నిలిచింది. దీంతో పాటు హీరో బాలకృష్ణ నిర్వహిస్తున్న అన్‌స్టాపబుల్‌ (ఆహా) ప్రోగ్రాం నిర్వాహకులు గ్రామస్తులను డిసెంబర్‌ 26న ఆహ్వానించారు. కార్యక్రమానికి సినీనటుడు పవన్‌కళ్యాణ్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తోడసం శంభు గ్రామానికి చెందిన గ్రామ పటేల్‌ లింభారావ్‌ పటేల్‌, జెత్‌రావు, జైతు ఈ ప్రోగ్రాంకు వెళ్లి గ్రామంలోని గిరిజనుల దీనస్థితిని వివరించారు. దీంతో గ్రామస్తులకు ఆహ ప్రోగ్రాం నుంచి రూ.లక్ష చెక్కును బాలకృష్ణ, పవన్‌ కళ్యాణ్‌ అందజేశారు. త్వరలో గ్రామానికి వెలుగు నిచ్చేందుకు సోలార్‌ సిస్టమ్‌ ఏర్పాటు చేయిస్తామని ప్రోగ్రాం తరఫున హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి రూ.లక్ష చెక్కు, చీకటిలో మగ్గుతున్న చాకిరేవు గ్రామానికి వెలుగునిచ్చేందుకు సోలార్‌ సిస్టం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్న అన్‌స్టాపబుల్‌ (ఆహా) ప్రోగ్రాం నిర్వాహకులు, హీరో బాలకృష్ణకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

సైబర్‌ మోసానికి గురైన మరో వ్యక్తి

- క్రెడిట్‌కార్డు నుంచి రూ.49వేలు మాయం

ఆదిలాబాద్‌టౌన్‌: సైబర్‌ మోసగాళ్ల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో అనేకమంది మోసపోయిన విషయం తెలిసిందే. గత నెల చివరి వారంలో ఓ వ్యక్తి క్రెడిట్‌కార్డు ద్వారా డబ్బులు మాయం కాగా, ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదిలాబాద్‌ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన షాకీర్‌కు గతనెల 31న ఫోన్‌కు కాల్‌ వచ్చింది. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఆయన భార్య ఫోన్‌లిఫ్ట్‌ చేసింది. సైబర్‌ మోసగాళ్లు క్రెడిట్‌ పాయింట్లు యాడ్‌ అవుతాయని చెప్పారు. అది డబ్బుల రూపంలో అకౌంట్‌లో జమ అవుతాయని, ఫోన్‌కు లింక్‌ పంపుతామని పేర్కొన్నారు. దీంతో ఆమె ఆ లింక్‌ను ఓపెన్‌ చేయడంతో క్రెడిట్‌కార్డు నుంచి రూ.49,644 మాయం అయ్యాయి. దీనికి సంబంధించి ఫోన్‌కు మెస్సేజ్‌ రావడంతో ఆమె ఖంగుతింది. ఈ విషయాన్ని తన భర్తకు తెలియజేయడంతో ఆయన యాక్సిస్‌ బ్యాంక్‌కు వెళ్లి వివరించారు. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో, ఆన్‌లైన్‌ ద్వారా సైబర్‌ క్రైమ్‌కు కూడా ఫిర్యాదు చేశాడు.

లింబారావుకు మెరుగైన వైద్యం అందించాలి

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భుజంగ్‌రావు



లింబారావును పరామర్శిస్తున్న భుజంగ్‌రావు

నార్నూర్‌: అటవీశాఖ అధికారి చేతిలో గాయపడిన లింబారావు ఆరోగ్యం క్షీణిస్తోందని, అతడికి మెరుగైన వైద్యం అందించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు కోరారు. శుక్రవారం గాంధీ ఆస్పత్రి నుంచి లింబారావును వైద్యులు డిశ్చార్జి చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న అతడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింబారావు నయం కాకున్నా ఎందుకు డిశ్చార్జి చేస్తున్నారని వైద్యులను అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. బాధితుడి నడుము, కాళ్లు, చేతులు పని చేయడం లేదని తెలిపారు. ఉట్నూర్‌ అటవీశాఖ కార్యాలయాన్ని ఆదివాసీలు ముట్టడించిన సమయంలో ఎఫ్‌డీఎఫ్‌వో పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు బాధితుడిని చూడలేదన్నారు. మెరుగైన వైద్యం అందించాల్సిన సమయంలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేయడమేమిటని ప్రశ్నించారు. లింబారావుకు ఏదైనా జరిగితే అటవీశాఖ అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వెంటనే అధికారులు స్పందించి ప్రైవేట్‌లో కార్పొరేట్‌ వైద్యం అందించాలని డిమాండ్‌ చేశారు. ఆయన వెంట బలాన్‌పూర్‌ సర్పంచ్‌ ఆత్రం పరమేశ్వర్‌ తదితరులున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఇచ్చోడ: సాథ్‌నంబర్‌ గ్రామానికి చెందిన బిషే దిగంబర్‌ (45) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్‌, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సాథ్‌నంబర్‌కు చెందిన దిగంబర్‌ కొద్ది రోజులుగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. గురువారం అతిగా మద్యం సేవించి రాత్రి 8గంటల ప్రాంతంలో తన పంటపొలం వద్ద కు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం వరకు దిగంబర్‌ ఇంటికి రాక పోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు పంటపొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే దిగంబర్‌ మృతదేహం కనిపించింది. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెంకటాపూర్‌లో పత్తి దగ్ధం

భీమిని: వెంకటాపూర్‌ గ్రామంలో గురువారం రాత్రి చదువుల శ్రీనివాస్‌కు చెందిన 20 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌ తన చేను నుంచి సేకరించిన సుమారు 280 క్వింటాళ్ల పత్తిని ధర లేక ఇంటి వద్ద నిల్వ చేసుకున్నాడు. గురువారం రాత్రి పత్తి నుంచి మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు చెందిన సుమారు రూ.1.80లక్షల విలువైన పత్తి పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని తాండూర్‌ సీఐ జగదీశ్‌, ఎస్సైలు వెంకటేశ్‌, సురేశ్‌ పరిశీలించారు. 20 రోజుల వ్యవధిలో గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన పత్తికి మంటలు అంటుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే అనుమానం వ్యక్తంజేస్తూ బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

- ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన



మహిత (ఫైల్‌)



ఆసుపత్రివద్ద రోదిస్తున్న బంధువులు

సారంగపూర్‌: మండలంలోని జామ్‌ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో శుక్రవారం విద్యార్థిని ఇప్ప మహిత (12) అనారోగ్యంతో మృతి చెందింది. తోటి విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోన్‌ మండలం పాక్‌పట్ల గ్రామానికి చెందిన మహిత జామ్‌ గురుకుల పాఠశాలలో ఐదోతరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం తోటి విద్యార్థులతో ఆడుకుంటూనే అకస్మాత్తుగా కిందపడగా కాలికి గాయమైంది. శుక్రవారం ఉదయం యోగా చేసిన అనంతరం కళ్లుతిరిగి పడిపోయింది. మహితను పాఠశాల ఆవరణలోని ఆసుపత్రి గదికి తరలించారు. ఏఎన్‌ఎం సూచన మేరకు ఆటోలో నిర్మల్‌ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఈ ఘటనపై గురుకులాల ఆర్‌సీఓ మేరీ ఏసుపాదం పాఠశాలలో విచారణ చేపట్టారు.

ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

మహిత మృతి విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్‌ రమాకళ్యాణి ఆమె తల్లి సరితకు తెలుపగా బంధువులు, గ్రామస్తులు అధికసంఖ్యలో ఆసుపత్రికి చేరుకున్నారు. మహిత మృతికి పాఠశాల సిబ్బందే కారణమని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసుల చొరవతో ఆందోళన విరమించారు.

పాఠశాల వద్ద విద్యార్థి సంఘాలు..

బీజేపీ మండలాధ్యక్షుడు కరిపె విలాస్‌, ఏబీవీపీ నాయకుడు ఒడిసెల అర్జున్‌, పీడీఎస్‌యూ జిల్లా సహ కార్యదర్శి నవీన్‌, భోజన్న తదితరులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. లోనికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. సోన్‌ సీఐ రాంనర్సింహారెడ్డి, నర్సాపూర్‌, దిలావర్‌పూర్‌ ఎస్సైలు వారిని అరెస్ట్‌ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థిని మృతికి అసలు కారణం దాచి పెట్టి అనారోగ్యంతో మృతి చెందినట్లు పాఠశాల సిబ్బంది చెప్పడాన్ని ఖండించారు. వెంటనే విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలని, బాధిత కుటుంబానికి రూ.10వేల పరిహారం ఇవ్వాలని బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్‌ డిమాండ్‌ చేశారు. బీజేపీ నాయకుడు డాక్టర్‌ మల్లికార్జున్‌రెడ్డి పాఠశాలకు వెళ్లి విద్యార్థిని మృతిపై ఆరా తీశారు. మహిత తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. కాగా, విద్యార్థి తండ్రి ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లాడు.

వైభవం.. వెంకన్న కల్యాణం

- అధికసంఖ్యలో హాజరైన భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

తాంసి: భీంపూర్‌ మండలం పిప్పల్‌కోటి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన వేంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఎనిమిదో వార్షికోత్సవంలో భాగంగా మూడురోజులుగా ఆలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో ప్రతిరోజూ హోమం, అర్చన, హారతి నిర్వహిస్తూ భజన, సంకీర్తనలు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ముందుగా గ్రామంలో డప్పుచప్పుళ్లతో లక్ష్మీవేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం పండితులు నేరేళ్ల కళ్యాణాచార్యులు, రాంగోపాల్‌వర్మ మంత్రోచ్చారణల మధ్య శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తజనుల మధ్య వేడుకగా నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించడానికి నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్‌, భీంపూర్‌ జెడ్పీటీసీ సుధాకర్‌, ఎమ్మెల్యే తనయుడు రాథోడ్‌ విశ్వజిత్‌, కొండయ్య చౌదరి, దేవన్న తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన కల్యాణాన్ని వీక్షించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి, జిల్లా కేంద్రం, మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో రాగా ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యాలు భక్తులను ప్రత్యేకంగా అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్‌ కళ్యాణిగంగయ్య, వైస్‌ ఎంపీపీ లస్మన్న, గ్రామపెద్దలు అనిల్‌, నాగయ్య, స్వామి, అఫ్రోజ్‌, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఆగిన ఊపిరి

- గుండెపోటుతో విద్యుత్‌ విజిలెన్స్‌ అధికారి మృతి



షేక్‌ కరీమొద్దీన్‌ (ఫైల్‌)


ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని కుమ్మరితాండ గ్రామంలో శుక్రవారం విధులు నిర్వహిస్తున్న విద్యుత్‌ శాఖ విజిలెన్స్‌ అధికారి షేక్‌ కరీమొద్దీన్‌ (55) గుండెపోటుతో మృతి చెందాడు. తోటి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌ విద్యుత్‌ ప్రధాన కార్యాలయం నుంచి తనిఖీలు చేయడానికి కుమ్మరితాండ గ్రామానికి కరీమొద్దీన్‌ వచ్చాడు. తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో హఠాత్తుగా గుండెపోటు రాగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి ఉద్యోగులు ఉట్నూర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు కరీమొద్దీన్‌ మృతి చెందినట్లు నిర్ధారించారు. కరీమొద్దీన్‌ మృతిపై విద్యుత్‌ సిబ్బంది సంతాపం తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని తెలంగాణ చౌక్‌ సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని శ్రీరాం కాలనీకి చెందిన సంజీవ్‌ బైక్‌ పైనుంచి కిందపడ్డాడు. దీంతో తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వైద్యం కోసం రిమ్స్‌ ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

భైంసారూరల్‌: భైంసా–బాసర ప్రధాన రాహదారిపై దేగాం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయిపటేల్‌ (30) అనే యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై సాయిపటేల్‌ దేగాం గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో భైంసా నుంచి నిజామాబాద్‌ వెళ్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనం నడుపుతున్న సాయి పటేల్‌ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామశివారులోని గాంధారి మైసమ్మ ఖిల్లా గుట్ట ప్రతిబింబం శుక్రవారం చెరువు నీటిలో చూడముచ్చటగా కనిపించింది. ఇటుగా వెళ్లేవారు ఆగి మరీ.. ఈ చిత్రాన్ని చూడడం ‘సాక్షి’ కంటపడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, మంచిర్యాల